# పాలే విషమై.. కవలలకు శాపమై..!

- డబ్బా పాలు వికటించి ఇద్దరు పిల్లలు మృతి
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొల్లపల్లిలో ఘటన



పాలపొడి డబ్బాను చూపెడుతున్న తల్లి లాస్యశ్రీ,



మృతిచెందిన కవల పిల్లలు

గణపురం, ఫిబ్రవరి 22 : డబ్బా పాలు వికటించి నాలుగు నెలల కవల పిల్లలు మృతిచెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గొల్లపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గొల్లపల్లికి చెందిన మర్రి అశోక్-లాస్యశ్రీ దంపతులకు నాలుగు నెలల క్రితం రెండో సంతానంలో కవలలు(పాప, బాబు) జన్మించారు. లాస్యశ్రీ పిల్లలతో ఇటీవల తల్లిగారిల్లు నగరంపల్లెకి వెళ్లింది. పిల్లలకు పాలు సరిగా అందకపోవడంతో భర్తకు విషయం చెప్పింది. దీంతో అశోక్ గణపురంలోని ఓ మెడికల్ షాపులో పాల పౌడర్ తీసుకొచ్చాడు. శనివారం ఉదయం 8గంటలకు ఒకసారి, 10 గంటలకు మరోసారి తాగించి పిల్లలను పడుకోబెట్టింది. 12గంటల సమయంలో పిల్లల్లో కదలిక లేకపోవడంతో అనుమానం వచ్చి చూడగా.. ముక్కుల్లోంచి పాలు కారడం గమనించింది. వెంటనే పిల్లలను ఆర్ఎంపీకి చూపించగా. ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించాడు. భూపాలపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే చిన్నారులు మృతిచెందినట్లు నిర్ధారించారు. పౌడర్ పాలు తాగడం వల్లే కవల పిల్లలు మృతిచెందారని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న బిడ్డలు కండ్ల ముందే విగతజీవులుగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అడుగంటిన ఆకేరు..



2023 ఏప్రిల్‌లో అలుగు పోస్తూ..

ప్రస్తుతం నీళ్లు లేక ఎండిపోయిన ఆకేరు వాగు

నర్సింహులపేట, ఫిబ్రవరి 22 : కేసీఆర్ హయాంలో మే నెలలోనూ మత్తళ్లు పోసి పంటలకు సాగునీరు పుష్కలంగా అందేది. కానీ ఇప్పుడు ఎస్సారెస్పీ ప్రధాన కాల్వతో పాటు ఉప కాల్వల ద్వారా తక్కువగా రావడంతో ఆకేరును నమ్ముకున్న రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎప్పుడూ అలుగుపోసే ఆకేరు వాగు ప్రస్తుతం ఇలా వట్టిపోయి కనిపిస్తోంది.

# చెల్లి పెళ్లి చూడకుండానే..

- తెల్లవారితే వివాహం.. రోడ్డు ప్రమాదంలో అన్న మృతి
- మిత్రుడి ఇంట్లో శుభకార్యానికి వెళ్లొస్తుండగా ఘటన
- ప్రమాదంలో మరో యువకుడు సైతం దుర్మరణం
- విషాదంలో కుటుంబసభ్యులు, బంధువులు



పెండ్లి ఏర్పాటుతో ఉన్న ఇళ్లు



ఎర్ర అఖిల్ (ఫైల్)

కరీమాబాద్/ నయీంనగర్, ఫిబ్రవరి 22 : బంధువుల సందడితో కోలాహలంగా ఉండాల్సిన ఆ ఇల్లు.. విషాదంతో బోసిపోయింది. తెల్లారితే తమ కూతురు పెండ్లి అని సంబురపడిన తల్లిదండ్రులను కొడుకు మరణవార్త కుంగదీసింది. చెల్లి పెళ్లిలో అన్నీ తానై ఉంటాడనుకున్న అన్న ఆ వేడుక చూడకుండానే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయి తీరని దుఃఖం మిగిల్చింది. ఈ సంఘటన ఓఆర్ఆర్‌పై రెడ్డిపురం వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వరంగల్ కరీమాబాద్ ఉర్సు ప్రాంతానికి చెందిన ఎర్ర కృష్ణ-ఉమ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు అఖిల్(24), పెద్దపల్లి జిల్లా రామగిరి మండలానికి చెందిన గడ్డం చైతన్య(24) కలిసి తమ స్నేహితుడి ఇంట్లో వివాహానికి బైక్‌పై వెళ్లారు. ఆరెపల్లి నుంచి తిరిగి వస్తున్న క్రమంలో రెడ్డిపురం వద్ద కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ఇద్దరు మృతిచెందారు. ఘటనకు కారణమైన నిందితుడు అజిత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కారును సీజ్ చేసినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. రాత్రి మిత్రుడి ఇంట్లో శుభకార్యానికి వెళ్లిన తమ కుమారుడు విగతజీవిగా రావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అఖిల్ మృతితో శోకసంద్రంలో మునిగిపోయారు.

# హాట్ ఫేవరెట్.. హై ఓల్టేజ్ మ్యాచ్

## నేటి దాయాదుల పోరుపై క్రీడాభిమానుల్లో అమితాసక్తి

- దుబాయ్‌లో ఇండియా-పాక్ మధ్య క్రికెట్ మ్యాచ్
- వీక్షించేందుకు రిసార్ట్‌లు, హోటళ్లలో బుకింగ్స్ ఫుల్



హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 22 : అసలుసిసలైన సమరానికి సమయం ఆసన్నమైంది. క్రికెట్ ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న టైం రానే వచ్చింది. ఆదివారం భారత్-పాకిస్థాన్ మధ్య హైఓల్టేజ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. దుబాయ్ వేదికగా చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా దయాదుల మధ్య హోరాహోరీ ఫైట్ జరుగనున్నది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో మ్యాచ్ అంటే ఆ మజాయే వేరు. పాక్ బౌలర్లను భారత బ్యాట్స్‌మెన్స్ చీల్చి చెండాడుతుంటే చూడాలని ప్రతి ఒక్క భారత క్రికెట్ ప్రేమికుడు కోరుకుంటారు. పాక్‌పై గెలిచిన విజయ గర్వాన్ని చూడాలని ఆశపడుతుంటారు. ఇప్పటికే బంగ్లాతో గెలిచిన టీమిండియా అదే ఉత్సాహంతో దుబాయ్‌లో పాక్‌తో తలపడనున్నది. వన్డేల్లో ఎప్పుడు మ్యాచ్ జరిగినా భారత్‌దే ఆధిపత్యం. దీంతో హాట్ ఫేవరేట్‌గా భారత్, పాక్ రంగంలోకి దిగుతున్నాయి. కాగా, మ్యాచ్‌ను వీక్షించేందుకు అభిమానులు ముందుగానే ప్లాన్ చేసుకున్నారు. దీనికి ఆదివారం కలిసిరావడంతో ఎంజాయ్ చేస్తూ మ్యాచ్ చూసేలా రిసార్టులు, హోటళ్లలో ముందుగానే రూమ్‌లు అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్నారు. టీం ఇండియా తన తొలి మ్యాచ్ బంగ్లాపై విజయం సాధించగా పాక్ మాత్రం కివీస్ చేతిలో ఘోరపరాభవం ఎదుర్కొన్నది. ఈ మ్యాచ్‌లో పాక్‌పై గెలిచి సెమీస్ బెర్తును ఖరారు చేసుకోవాలనే లక్ష్యంతో భారత్ బరిలోకి దిగుతున్నది. మరోవైపు పాక్‌కు ఇది చాలా కీలకమైన మ్యాచ్. ఇందులో ఓడితే డిఫెండింగ్ చాంపియన్ ఇంటిముఖం పట్టాల్సిందే. టోర్నీ అంతా ఒకెత్తు అయితే.. దాయాది దేశం పాకిస్థాన్‌తో భారత్ తలపడనున్న మ్యాచ్ మరో ఎత్తు.. ఇదిలా ఉంటే ఇండియా-పాక్ మ్యాచ్ కోసం ఆన్‌లైన్‌లో టికెట్లు పెట్టిన కొద్ది నిమిషాల్లో అమ్ముడుపోవడం చూస్తే అభిమానుల్లో ఏ రేంజ్ ఎదురుచూస్తున్నారో తెలుస్తోంది. మరి విజయం ఎవరిని వరిస్తుందో వేచిచూడాల్సిందే.

# పంట చేతికొచ్చేనా?

## ఆవిరవుతున్న రైతుల ఆశలు

- బావులు, బోర్లు అడుగంటి ఇబ్బందులు
- మళ్లీ తప్పని బావుల పూడికతీత పనులు



ఎండిపోయిన వర్ధరాజుల కుంట

### ఐదేళ్లలో ఎప్పుడూ ఎండిపోలే




ఐదేళ్లగా బావిలో నీరు తగ్గిందిలేదు. పంట ఎండిపోయింది లేదు. బోరు నుంచి చిన్నధారల నీరు వస్తుంది. దీంతో రెండు వరి మళ్లు పారుతున్నాయి. ఇప్పుడే వరుస తాళ్లు పెట్టే పరిస్థితి ఉంది. వరి వేసి రెండు నెలలైతాంది. ఇప్పుడే పంటకు నీరు అందక ఇబ్బందైతాంది. ఇంకా నెల పదిహేను రోజులు పంటకు నీళ్లు పెట్టుడు కష్టంగానే ఉన్నది. పంట చేతికొచ్చుడు కష్టమే.

– గుగులోత్ గింధి, రూప్లాతండా



రూప్లాతండాలో క్రేన్‌తో బావిలో పూడిక తీస్తున్న రైతులు



బంజరలో ఎండి పోయిన వరిలో దిగాలుగా కూర్చున్న రైతు

నర్సింహులపేట, ఫిబ్రవరి 22 : పంటను కాపాడుకునేందుకు రైతులు ఎప్పుడూ లేని కష్టాలు పడాల్సి వస్తోంది. చెరువుల్లో నీళ్లులేక భూగర్భజలాలు అడుగంటిపోవడం, ఎస్సారెస్పీ కాలువలో వారానికోసారి వచ్చే నీళ్లు ఎండిన కాల్వ తడవడానికే సరిపోవడం, ఫిబ్రవరి నెలలోనే ఎండలు ఎక్కువ కావడంతో సాగునీటికి అల్లాడాల్సిన పరిస్థితి వచ్చింది. ఇక చేసేదేమీ వేలకు వేలు ఖర్చు పెట్టి బావులను పూడిక తీయిస్తూ క్రేన్ సహాయంతో ఎక్కువ లోతు తవ్విస్తున్నారు. అలాగే కొత్త బోర్లు వేస్తున్నారు. నర్సింహులపేట మండలం నర్సిహపురం బంజర గ్రామంలో బావుల్లో ఊట తక్కువ కావడంతో వరి పొలం నెర్రలు బారింది. వాగులు వంకలు ఒర్రెల నుంచి ఇసుకను తరలించడంతో భూగర్భజలాలు అడగుంటున్నాయి. గతేడాదితో పోలిస్తే మీటర్ లోతులోకి నీరు వెళ్లిందని రైతులు చెబుతున్నారు. రైతులు సొంత ఖర్చులతో ఉప కాలువలో చెత్తాచెదారం తొలగించినా చుక్కనీరు రావడం లేదంటున్నారు. దీనికి తోడు వర్ధరాజుల కుంట పూర్తిగా ఎండిపోవడంతో భూగర్భ జలాలు సైతం అడుగంటి వరికి చేతికి వచ్చేలా లేదని ఆవేదన చెందుతున్నారు. వందల ఫీట్లు బోరు వేసినా నీరు ధారలాగే వస్తున్నదని ఇలాగైతే యాసంగి వరి పంట చేతికొచ్చే అవకాశం లేదని ఆవేదన వ్యక్తంచేసున్నారు. ఐదేళ్లలో ఇలాంటి పరిస్థితి రాలేదని చెబుతున్నారు. మరో నెల రోజుల్లో పంట చేతికి అందుతుందనుకున్న సమయంలో బోర్లు, బావులు ఎండిపోతుండడం పంట పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదని నర్సింహులపేట మండలం రైతులు ఆందోళన చెందుతున్నారు.

### మక్కజొన్న చేతికొచ్చేలా లేదు



ఐదేళ్ల నుంచి ఇలాంటి పరిస్థితి చూడలేదు. బావిలో నీరు దొరికే అవకాశం లేదు. రెండు ఎకరాలు మిరుప, ఎకరం మక్కజొన్న వేసిన రెండు పంటలకు నీళ్లు పెట్టుడు ఇబ్బందిగా ఉంది. మక్కజొన్న చేతికి వచ్చే సమయంలో నీరు లేక ఎండిపోయే అవకాశం ఉంది.

– గుగులోత్ హము, రూప్లాతండా

# రేపు మానుకోటలో ఎమ్మెల్సీ కవిత పర్యటన



మహబూబాబాద్ రూరల్/దంతాలపల్లి, ఫిబ్రవరి 22 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ నెల 24న మానుకోట జిల్లాలో పర్యటించనున్నారు. కేసముద్రం, కురవి, మరిపెడ, దంతాలపల్లి మండలాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నా రు. దంతాలపల్లి మండలం రామానుజపురం గ్రామానికి చెందిన చిర్ర సతీశ్ (దివ్యాంగుడు)కేసీఆర్ జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న కవిత సతీశ్‌కు సహాయం చేస్తానని హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం రామానుజపురం గ్రామంలో ఎమ్మెల్సీ కవిత సౌజన్యంతో ఏర్పాటు చేసిన కేసీఆర్ ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్‌ను సోమవారం ఉదయం 9.00 ప్రారంభించనున్నారు. 9.45 గంటలకు మరిపెడ మండలం చిల్లంచర్లలో జాగృతి నాయకురాలు మరిపెల్లి మాధవి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు. 10.30 గంటలకు కురవి వీరభద్ర స్వామి దర్శనం, 11.15 గంటలకు మానుకోట మిర్చియార్డ్ సందర్శన, మధ్యాహ్నం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తారు. 1.20గంటలకు కేసముద్రం మండలం అన్నారంలో సింగర్ మానుకోట ప్రసాద్ ఇంటిని సందర్శిస్తారు.

# ఆవిష్కరణలకు అడుగుపడేనా?

## నిరుపయోగంగా కే-హబ్

రీసెర్చ్, ఇన్నోవేషన్, క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్. ఇదీ కే-హబ్ ఉద్దేశం. విద్యార్థులను పరిశోధనలు, సరికొత్త ఆవిష్కరణల వైపు నడిపించేందుకు కేయూలో నిర్మించిన కే-హబ్ నిరుపయోగంగా మారింది. రూ.50కోట్లతో ఏర్పాటుచేసినప్పటికీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఆవిష్కరణల వైపు ముందడుగు పడడం లేదు. మంత్రులు దీనిని ప్రారంభించి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ తెరుచుకోకపోగా పిచ్చిమొక్కలు, మందుసీసాలతో అధ్వానంగా కనిపిస్తున్నది. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి తోడ్పడే ఇంక్యుబేషన్ సెంటర్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

– హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 22

### రుసా నుంచి రూ.50 కోట్లు మంజూరు..

రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షాఅభియాన్(రుసా) కింద 2018లో కే-హబ్ మంజూరు చేశారు. రీసెర్చ్, ఇన్నోవేషన్, క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ కోసం కే-హబ్ నిర్మాణానికి రూ.50 కోట్లు మంజూరు చేసింది. రూ.6 కోట్లతో బిల్డింగ్, రూ.9 కోట్లతో మౌలిక వసతులు, రూ.23 కోట్లతో సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్, సెంటర్ ఫర్ డ్రగ్ రీసెర్చ్, సెంటర్ ఫర్ మాలిక్యూల్స్ అండ్ మెటీరియల్ ఫిజిక్స్, సెంటర్ ఫర్ నానో డ్రగ్ డెలివరీ సిస్టమ్స్, సెంటర్ ఫర్ ఇథ్నో మెడిసినల్ ప్లాంట్స్ రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కే-హబ్‌కు పక్కా బిల్డింగ్‌తో పాటు వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన రీసెర్చ్ సెంటర్స్, ఇతర మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. ఇంకా కంప్యూటర్లు, కావాల్సిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తీసుకురావాల్సి ఉంది.



కే-హబ్ ఎదుట తాగిపడేసిన మందుసీసాలు





కాకతీయ యూనివర్సిటీలోని కే-హబ్

### కే-హబ్ ప్రారంభిస్తే..

కే-హబ్ ప్రారంభిస్తే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), బయోడైవర్సిటీ రక్షణ, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్, ఫార్మాస్యూటికల్ సైన్స్, జియోలాజికల్ సైన్స్, మైనింగ్, ఇతర రంగాల్లో పరిశోధనలకు అవకాశం ఉంటుం ది. అసాధారణ, విశిష్టమైన పరిశోధన అవుట్‌పుట్ కోసం పేటెంట్లు పొందేందుకు ఈ కేంద్రం కోసం వివిధ ఏజెన్సీల నుంచి నిధులను పొందేందుకు కమిటీలు పనిచేస్తాయి. కే-హబ్‌లో అనేక స్టార్టప్ కంపెనీలకు వ సతి కల్పిస్తారు. ఇవేగాక ఇంకెన్నో విభాగాలకు సంబంధించినవి పరిశోధనలు చేసి నూతన ఆవిష్కరణల కోసం విద్యార్థులకు కావాల్సినవి కే-హబ్‌లో సమకూర్చుతారు.

### పరిశోధనలు, నాణ్యత మెరుగుదలకు..

కే-హబ్‌లో విద్యార్థులకు పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పొందేందుకు, పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించేందుకు వారికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అందించనున్నాయి. కే-హబ్ ప్రారంభమైన తర్వాత కేయూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు టీ-హబ్‌తో చేతులు కలపాలని అధికారులు యోచిస్తున్నారు. విద్యార్థులు హబ్‌లో పరిశోధన, నాణ్యత మెరుగుదల కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చు. నమూనాలు, స్లైడ్‌లు మొదలైన వాటితో కూడిన సైన్స్ మ్యూజియం, మాన్యుస్క్రిప్ట్‌లు, కళాఖండాలు, గ్రానైట్ శిల్పాలు మొదలైన వాటితో చరిత్ర మ్యూజియం కూడా ఏర్పాటు చేసే అవకాశం లేకపోలేదు.

కోట్లు ఖర్చుపెట్టి కేయూ క్యాంపస్‌లో నిర్మించిన కే-హబ్ నిరుపయోగంగా మారింది. గతేడాది మార్చి 10న ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు ప్రారంభించినప్పటికీ మౌలిక వసతులు, పరిశోధనలకు అవసరమైన ఏర్పాట్లు చేయకుండా అధికారులు బిల్డింగ్‌కు తాళాలు వేశారు. అప్పటి నుంచి కే-హబ్‌ను తెరుచుకోకపోవడంతో ప్రాంగణమంతా గడ్డి, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. పరిశోధనలకు కావాల్సిన పక్కా భవనం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇతర ఎక్విప్‌మెంట్ కోసం నిధులు సిద్ధంగా ఉన్నా కూడా వర్సిటీ అధికారుల నిర్లక్షం వల్ల పరిశోధనల వైపు అడుగులు పడడం లేదని ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు మండిపడుతున్నారు.

- పిచ్చిమొక్కలు, మందుసీసాలతో అధ్వానంగా పరిసరాలు
- మార్చిలో మంత్రులు ప్రారంభించినా తెరుచుకోని వైనం
- అందుబాటులోకి తేవాలంటున్న విద్యార్థులు

### త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తాం



కే-హబ్ త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తాం. విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు, పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పొందేందుకు, పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించేందుకు వారికి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను అందించేందుకు ఎంతో దోహదపడతాయి. రుసా నుంచి మంజూరైన రూ.50 కోట్లను భవనం, మౌలిక వసతులకు వినియోగించాం. ఇంకా కొన్ని రీసెర్చ్ సెంటర్లకు కూడా అనుమతులు కూడా వచ్చాయి. కే-హబ్ విద్యార్థులు పరిశోధనలు, నాణ్యత మెరుగుదల కార్యక్రమాలను నిర్వహించేందుకు ఎంతో ఉపయోగపడుతుంది.

– వల్లూరి రాంచంద్రం, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్

# కొడుకు దూరమయ్యాడని..

- మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య
- రెండు రోజుల క్రితం కుమారుడి మృతి



కూచన రవి (ఫైల్)

దుగ్గొండి, ఫిబ్రవరి 22 : కొడుకు దూరమయ్యాడనే బాధ ఆ తండ్రి కుంగదీసింది. ఓ వైపు పక్షవాతంతో భార్య బాధపడుతుండగా, ఆరేళ్ల క్రితం కూతురు కరెంట్ షాక్‌తో చనిపోవడం, రెండు రోజుల క్రితం కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద సంఘటన దుగ్గొండి మండలం స్వామిరావుపల్లిలో శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చందిన కూచన రవి(50), రాజ్యలక్ష్మి దంపతులుకు కూతురు శిరీష, కుమారుడు సాయికుమార్(23) ఉన్నారు. కుమార్తె విద్యుత్ షాక్‌తో ఆరేళ్ల క్రితం మరణించింది. రాజ్యలక్ష్మి కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతోంది. కాగా ఈ నెల 16న ములుగు రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో సాయికుమార్ తీవ్రంగా గాయపడి ఎంజీఎంలో చికిత్స పొందుతూ 19న మృతిచెందాడు. కొడుకు దూరమయ్యాడన్న దిగులుతో రవి మూడు రోజులుగా తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. కుమారుడి 3వ రోజు కార్యక్రమానికి బంధువులందరూ రాగా రవి ఇంటి వద్ద బాత్‌రూంలోకి వెళ్లి గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు వరంగల్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు.

# సమాచారం లేకుండా విధులకు డుమ్మా

ఇనుగుర్తి పీహెచ్‌సీలో ఆరుగురు వైద్య సిబ్బందికి కలెక్టర్ మెమోలు

ఇనుగుర్తి, ఫిబ్రవరి 22 : సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఇనుగుర్తి పీహెచ్‌సీలోని ఆరుగురు వైద్య సిబ్బందికి మహబూబాబాద్ డీఎంహెచ్‌వో మురళీధర్ మెమోలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ అద్వైతకుమార్ సింగ్ పీహెచ్‌సీని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేయగా ఆ సమయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వారిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు ఆదేశించారు. ఈమేరకు డాక్టర్ సురేశ్, హెచ్ఈవో భిక్షపతి, ఫార్మసిస్ట్ శ్రీదేవి, సీనియర్ అసిస్టెంట్ రమాదేవి, ఎంపీహెచ్ఎస్‌లు కృష్ణకుమారి, శ్రీనివాస్‌కు మెమోలు జారీ చేసి రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

